


# త్రీ మంకీస్

2014లో మిసెస్ పరాంకుశం (జ్యోతిలక్ష్మి సినిమా) కథా చర్చకి ఓ రోజు మాత్రమే కలిసినప్పుడు దర్శకుడు శ్రీ పూరీ జగన్నాథ్ తను చిన్న బడ్జెట్‌తో, చిన్న హీరోలతో, కొత్త దర్శకులతో సినిమాలు నిర్మించేందుకు కథలని ఆహ్వానిస్తున్నానని చెప్పారు.

"అలాంటి కథని అల్లమంటారా?" అని అడిగితే "సరే" అన్నారు. ఈ రోజుల్లో బాగా చదువుకున్న వాళ్ళే కొత్తగా అందుబాటులోకి వచ్చిన విలాసాల కోసం నేరాలు చేసిన వార్తలు దినపత్రికల్లో చాలా చదివాను. అలాంటి నైతికత లేని ముగ్గురు యువకులని ముఖ్యపాత్రలుగా చేసుకుని హాస్యంగా ఓ క్రైం నవలని అల్లాను. కథ సిద్ధమైంది కానీ పూరీ జగన్నాథ్ అనేకసార్లు దినపత్రికల్లో చెప్పినట్లు చిన్న బడ్జెట్ సినిమాలని నిర్మించనే లేదు.




సాక్షి దినపత్రికలో మొదటిసారిగా నవలలని సీరియల్స్‌గా ప్రచురించదలచి సాక్షి ఎడిటర్ కె. రామచంద్రమూర్తిగారు నన్నో సీరియల్‌ని ఇవ్వమని కోరారు. సిద్ధంగా ఉన్న ఈ కామెడీ క్రైమ్ కథని వారికి చెపితే అంగీకరించారు. పూర్వం నేను రాసిన క్రైం కామెడీ నవలలకి భిన్నంగా ఈ నవలని నేటి యువత ఎలా ప్రవర్తిస్తుందో అలా ఎన్నడూ రాయని షార్ప్ పంచ్ డైలాగ్స్‌తో రాసాను. నేడు పిల్లలకి పెట్టే అర్థంలేని ఆధునిక పేర్లకి పేరడీగా అన్ని పాత్రలకి తమాషా పేర్లు పెట్టాను. ముగ్గురు హీరోల పేర్లు మర్కట్, వానర్, కపీష్, ఈ మూడిటి అర్థం కోతే. ఓ హీరోయిన్ అతి శుభ్రమైన అమ్మాయి. తర్వాత ఓ తెలుగు సినిమాలో ఈ పాత్రని వాడుకున్నారు. సినిమాల్లో కాపీ కొట్టేప్పుడు ఆడని మగ, మగని ఆడ చేయడం చాలాకాలంగా వస్తున్న ఆచారం. (రాముడు - భీముడు, గంగ-మంగ) దాన్ని కూడా పాటించారు. కొత్త ఆలోచనలు చేయలేని ఇలాంటి వాళ్ళు అసలు సినిమా రంగంలోకి ఎలా ప్రవేశిస్తున్నారో నాకు అర్థంకాదు. మళయాళ సినిమాల్లో కథలు తెలివిగా ఉంటాయి. టెంత్ ఫెయిలైన వాళ్ళు సినిమాల మీద ఉత్సాహంతో వచ్చి తెలుగు సినిమా దర్శకులు అవడం వల్లే ఈ భావదారిద్ర్యం అనుకుంటున్నాను.

ఇక కథ గురించి. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ అయిన మర్కట్, వానర్, కపీష్‌లు నిరుద్యోగ సమస్య, డబ్బు ఇబ్బందులవల్ల చిన్న కామెడి నేరాలు చేసి పట్టుబడి జైలుకి వెళ్తారు. ముగ్గురికీ నవ్వొచ్చే కేరక్టరైజేషన్ గల ప్రియురాళ్ళు ఉంటారు. జైల్లోని సీనియర్ ఖైదీలు ఓ బేంక్‌లోకి పక్కనే ఉన్న షాప్‌లోంచి సొరంగాన్ని తవ్వి దొంగతనం చేయబోతున్నారని తెలుసుకుంటారు. జైల్లోని ఓ ఆడ గార్డ్ మర్కట్‌ని ప్రేమిస్తుంది. ఆమె సాయంతో ముగ్గురూ పారిపోతారు. ఆ దొంగలకన్నా ముందే సొరంగంలోకి జొరబడతారు. వాళ్ళ వెనక అసలు దొంగలు,

వాళ్ళని వెంటాడే పోలీసులు ఉన్నారని తెలీదు. బేంక్‌లో విజయవంతంగా దొంగతనం చేసి, పోలీసుల కళ్ళు కప్పి పారిపోయి ఆ డబ్బుతో విమానం ఎక్కుతారు. అక్కడ ఓ ట్విస్ట్‌లో వాళ్ళాడబ్బుని కోల్పోతారు. చివరికి అది బేంక్‌కి భద్రంగా చేరుకుంటుంది.

ఈ నవల వెలువడుతూండగానే కలకత్తాలో దొంగలు సొరంగం తవ్వి ఓ బేంక్ దోపిడీ చేయడం జరిగింది.

పూర్వం పాఠకులు పోస్ట్ కార్డ్ ద్వారా స్పందించేవాళ్ళు. నేడు ఎలక్ట్రానిక్ మీడియా చాలామందికి అందుబాటులో ఉండటంతో పాఠకులు నించి రెస్పాన్స్ కోసం ప్రత్యేకంగా ఓ ఈ మెయిల్ ఐడిని (త్రీమంకీస్‌ఎట్‌జి మెయిల్.కాం) సృష్టించి ఆ డైలీ సీరియల్లో ఇచ్చాను. సగటున రోజుకి 20-25 మెయిల్స్ దాకా వచ్చేవి. నవల ప్రమోషన్‌కి చిన్న పోటీని కూడా పెట్టాం. విజేతలకి నవల వెలువడ్డాక నా ఆటోగ్రాఫ్‌తో పుస్తకాలని పంపాను. తెలుగు దినపత్రికల్లో పాఠకులు సీరియల్స్ చదవరనే అభిప్రాయం తొలిగించడానికి, సీరియల్స్ చదివే పాఠకులని మళ్ళీ వెనక్కి తీసుకురావడానికి, నేటి తరంలోని చదివే పాఠకులకి దగ్గరగా ఉండే పాత్రలతో రాసిన కథ వల్ల త్రీ మంకీస్ సాక్షికి సహాయం చేస్తుందని భావించాను. కానీ దీని తర్వాత సాక్షి డైలీ సీరియల్‌ని వేయలేదు.

2015లో ప్రిజమ్ బుక్స్ దీన్ని నవలగా ప్రచురించింది. 216 పేజీలు. రూ.185. ప్రస్తుతం మార్కెట్లో కాపీలు లేవు.

ఇక్కడ సాక్షి గురించి ఓ విషయం చెప్పాలి. పారితోషికంగా నేను కోరిన లక్ష బేరం ఆడకుండా ఇచ్చారు. గతంలో కూడా పారితోషికం విషయంలో సాక్షి యాజమాన్యం కొన్ని దినపత్రికల్లా తక్కువ ఇవ్వడం లేదా ఎగ్గొట్టడం చేయలేదు.

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments